మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు
దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం : వేములపూడి మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సంధ్య ఓ ప్రకటనలో కోరారు. 202-26 విద్యా సంవత్సరానికి గాను ఈ నెల 24 నుంచి మార్చి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు www.cse.ap.gov.in లేదా www.apms.acfss.in వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు


పూర్వ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డిని సన్మానిస్తున్న ప్రస్తుత ప్రిన్సిపాల్ రూప, ఉపాధ్యాయులు


అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


ఎ. కొత్తపల్లి హైస్కూల్‌లో..


మాడుగుల జెడ్పీ హైస్కూల్లో...


జె.నాయుడుపాలెంలో..

నర్సీపట్నం : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని ఎంజేపీ బీసీ బీసీ రెసిడెన్షియల్ స్కూల్ పూర్వ ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి పేర్కొన్నారు. పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథివెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా కష్టపడి చదివి నూరుశాతం మార్కులు సాధించాలని సూచించారు. ప్రిన్సిపాల్ రూప, నర్సింహరావు మాట్లాడారు.

దేవరాపల్లి : త్వరలో జరిగే పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించాలని దేవరాపల్లి మండల విద్యాశాఖ అధికారి బి.పదాల్‌దాస్ విద్యార్థులకు సూచించారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో పదాల్‌దాస్ ఆధ్వర్యంలో, ఎ. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వై.స్వర్ణలత ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాలు మంగళవారం ఘనంగా జరిగాయి. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, సందేశాత్మక నాటికలు అలరించాయి. టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేశారు.

మాడుగుల: ప్రధానోపాధ్యాయుడు ఎం. సత్యానందరావు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థులతో వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు దీవెనలు అందించారు. ప్రధానోపాధ్యాయుడు సత్యానందరావు మాట్లాడుతూ రానున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ విద్యార్థులకు రూ.10వేలు నగదు రూపేణా అందిస్తానని అభినందించారు.

రోలుగుంట : జె.నాయుడుపాలెం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. హెచ్‌ఎం రమేష్ కుమార్ మాట్లాడుతూ టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ

నాతవరం: పూర్వ ప్రాథమిక చిన్నారులు శారీరక మానసిక మేధో వికాసానికి జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయని ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. నాతవరం హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిసాయి. కోఆర్డినేటర్లు కన్నూరి అర్జున, దుర్గాప్రసాద్, కిశోర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఎంఆర్సీ అధికారులు, సీఆర్పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఈ నెల 18 వ తేదీ నుండి ప్రారంభమైన జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిసాయి. ఎంఈవోలు ఎం. పాండురంగారావు, బి. దేముడమ్మలు, ఐసీడీఎస్‌సీడీపీవో శ్రీదేవి మాట్లాడారు పూర్వ ప్రాథమిక విద్య మరింత పటిష్టం చేయడం, గుణాత్మక విద్య అందించడానికి ఈ శిక్షణ తరగతులు దోహద పడుతాయన్నారు.

చోడవరం రూరల్ : అంగన్‌వాడీ కార్యకర్తలకు అందిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం వారికి విజ్ఞాన జ్యోతి అని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్.పుష్పాదేవి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి ఆఖరి రోజు కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. అదే ప్రాంగణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)ను సందర్శించి ఉపాధ్యాయులు లక్ష్మి, రమణి తయారు చేసిన బోధనోపకరణాలను పరిశీలించి వారిని అభినందించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

దేవరాపల్లి : రైవాడ పంచాయతీ శివారు బేతపూడి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులకు పరీక్ష మెటీరియల్‌ను వితరణగా అందించారు. దేవరాపల్లికి చెందిన వరదపురెడ్డి చంద్రరావు, గౌరీ దంపతుల కుమారులు కౌశిక్‌నాయుడు, హేమచంద్రలు తమ సొంత సొమ్ముతో టెన్త్ విద్యార్థులతో పాటు ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థినులకు పరీక్ష మెటీరియల్‌ను సమకూర్చారు.

పట్టణ పారిశుధ్యం అధ్వానం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం : పట్టణంలో పారిశుధ్యం నానాటికీ దిగజారిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో పారిశుధ్యంపై ప్రధానంగా చర్చ జరిగింది. వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ తన వార్డుకు పారిశుధ్య కార్మికులే రావడం లేదన్నారు. పారిశుధ్యం మెరుగుకు మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.2 కోట్లు కేటాయించారు. పెద్ద మొత్తంలో నిధులు కేటాయించినప్పటికీ పారిశుధ్యం మెరుగు పడలేదన్నారు. ప్రజలు దోమలతో నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శానిటేషన్‌పై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధికారులకు సూచించారు. మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా బలిఘట్టం బ్రహ్మలింగేశ్వరస్వామి ఉత్తరవాహిని పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి కోరారు.

తాగునీటి సమస్య చక్కదిద్దండి

కె.కోటపాడు : వేసవి కాలం ప్రారంభమైన దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడా లని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో ఎ.ఎ.సాంబశివరావు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. బుధవారం మహాశివరాత్రి నేపథ్యంలో శివాలయాల ప్రాంగణాల్లో భక్తులకు సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

రేపు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్ రమాదేవి, ఎలక్షన్ డీటీ రాజా

మాడుగుల : స్థానిక జిల్లాపరిషత్ బాలుర హైస్కూల్ 10వ తరగతి ఎ సెక్షన్ తరగతి గదిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఈ నెల 27 వ తేదీన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయని, తహసీల్దార్ రమా దేవి తెలిపారు. పోలింగ్ కేంద్రానికి విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంకాలం 4 గంటలు వరకు మాత్రమే పోలింగ్ జరుగుతుందన్నారు. మాడుగుల హైస్కూల్లో ఏర్పాటు చేసిన 86 పోలింగ్ కేంద్రం పరిధిలో 55 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారన్నారు. పోలింగ్ సిబ్బంది 26 వ తేదీ సాయంకాలానికి పోలింగ్ కేంద్రానికి చేరుకుంటారన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.


ఉచిత చికెన్, ఎగ్ వంటకాలకు జనం క్యూ

దేవరాపల్లి : మండల కేంద్రంలో వెంకోబా కంపెనీ ప్రతినిధులు ఉచితంగా చికెన్, ఎగ్ వంటకాలను మంగళవారం పంపిణీ చేశారు. బర్డ్‌ఫ్లూ వదంతుల నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించడంలో భాగంగా చికెన్ ఫ్రై, ఉడక బెట్టిన గుడ్లు పంపిణీ చేశారు. నాలుగు రోడ్ల కూడలికి సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద నిర్వహించిన ఉచిత చికెన్, ఎగ్ మేళాలో నోరూరించే వంటకాల కోసం ప్రజలు ఎగబడ్డారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



చోడవరం : స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు చోడవరం పోలీసులు మంగళవారం తెలిపారు. సుమారు 60 నుంచి 65 ఏళ్ల వయసు గల వ్యక్తి గ్రే కలర్ ఫ్యాంటు, నీలం రంగుపై మెరూన్ రంగు నిలువు గీతలు గల చొక్కా, రబ్బరు చెప్పులు ధరించి ఉన్నట్టు తెలిపారు. మృతుడి జేబులో ఎన్ఏడీ నుంచి చోడవరం వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించినట్టు బస్సు టికెట్టు ఉంది. వివరాలు తెలిసిన వారు సీఐ చోడవరం-9440796090, ఎస్ఐ 1-చోడవరం -9492952555, ఎస్ఐ 2-8142936937, పోలీస్‌స్టేషన్ -08934245033 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



వైభవంగా లీలా కల్యాణం

మాడుగుల రూరల్ : మండలంలో వీరవల్లి అగ్ర హారం గ్రామంలో గల శ్రీ ఉమా భీమలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారి లీలా కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాంపల్లి విశ్వంభరశర్మ(సాధువు లు) కల్యాణం నలుగురు దంపతులుతో శాస్త్రోకంగా చేయించారు. ఈ కల్యాణం తిలకించడానికి గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



మహా శివరాత్రికి ఏర్పాట్లు

- శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలకు ఏర్పాట్లు


కె.కోటపాడులో గల భీమలింగేశ్వరాలయం


కె.జె.పురం శివాలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ


తిమిరాం శివాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో సువర్ణరాజు

కె.కోటపాడు : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం కె.కోటపాడులో గల భీమలింగేశ్వరాలయం, ఎ.కోడూరులో గల భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయం, లంకవానిపాలెంలో గల గృహలింగేశ్వరాలయం, చౌడువాడ కాశీ విశ్వేశ్వరాలయాల్లో శివునికి విశిష్ట పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. కె.కోటపాడు, ఎ.కోడూరు, చౌడువాడ శివాలయాల వద్ద అన్నసమారాధన జరపనున్నారు.

మాడుగుల రూరల్ : శివరాత్రి ఉత్సవాలతో కె.జె.పురం, ఎం.కోడూరు, జంపెన, కె.జె.పురం జంక్షన్‌లో గల మహంకాళి శివాలయాలను విద్యుత్ దీపాలంకరణ చేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచి పూజలు, అభిషేకాలు, రాత్రికి మహన్యాస రుద్రాభిషేకం, భక్తుల జాగరణ నిర్వహించనున్నారు.

దేవరాపల్లి : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని శివాలయాల్లో భక్తులకు సదుపాయాలు కల్పించాలని ఆయా గ్రామాల శివాలయ కమిటీ సభ్యులకు ఎంపీడీవోసువర్ణరాజు సూచించారు. మండలంలోని తిమిరాం, ఎం.ఆలమండ శివాలయాలను ఆయన సందర్శించారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం



బుచ్చెయ్యపేట : మండల కేంద్రంలో ఆంజనేయస్వామి తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామస్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆంజనేయస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలువురు కుంకుమ పూజలు, వ్రతాలు నిర్వహించారు. తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఐయితంపూడి, దిబ్బిడి, నేతవానిపాలెం, కేపీ అగ్రహారం, కొండపాలెం, పోలేపల్లి ప్రజలు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆలయానికి దాతల విరాళం


ఆలయంలో విరాళం అందజేస్తున్న దాతలు

మాడుగుల రూరల్: ఎం.కోడూరు మోదమాంబ అమ్మవారికి స్థానిక దాతలు మంగళవారం విరాళం అందజేశారు. గ్రామానికి చెందిన శీరా నూకరాజు సైదమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు కొండయ్య దంపతులు రూ.10వేల విరాళం అందజేశారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు ఈ మొత్తం అందజేశారు.

నేడు పోతురాజుబాబు తీర్థం

మాడుగుల రూరల్ : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని, మాడుగుల మామిడి వారి కళ్లాలు వద్ద గల పోతురాజుబాబు స్వామి వారి తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ వారు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ధూపదీప నైవేద్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం నుంచి అన్నసమారాధన, మధ్యాహ్నం టైరు బళ్ల పరుగుల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆలయం వద్ద కోలాటం, తోడపెద్దు సేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

విద్యుత్ లైన్‌మేన్‌ను నియమించాలి

బుచ్చెయ్యపేట : రాజాం గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నా అంధకారంలో ఉంటున్నామని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ లైన్‌మేన్ పోస్టు భర్తీ చేయకపోవడంతో ఫీజు పోయినా వేసే నాథుడు లేక చీకట్లో అల్లాడుతున్నామని గ్రామానికి చెందిన కర్రి నాయుడుబాబు, నాగేశ్వరరావు, లక్ష్మి, అప్పారావు తెలిపారు. పది నెలలుగా లైన్‌మేన్ లేకపోవడంతో విద్యుత్ సమస్య వస్తే చీకట్లో మగ్గాల్సి వస్తోందన్నారు. నాలుగు వేల జనాభా ఉన్న గ్రామానికి తక్షణం లైన్‌మేన్‌ను నియమించాలని కోరారు.









